# సాక్షి చిత్తూరు

బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024




## నాడు అధ్వానం.. నేడు అద్భుతం

పుత్తూరులో నూతనంగా నిర్మించిన షాదీ మహల్‌ను మంత్రి రోజా గురువారం ప్రారంభించనున్నారు. - 8లో



## 'ఇన్‌స్పైర్' చేద్దాం..!

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యంగా ఇన్‌స్పైర్ మనక్ నిర్వహించనున్నారు. - 8లో



## శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు స్వాగతం పలికారు. - 8లో

## న్యూస్‌రీల్

### సీఎం పర్యటనకు ఏర్పాట్లు

**శాంతిపురం :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుప్పం పర్యటన రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం పరిశీలించారు. సభాస్థలికి అవసరమైన భూములను సందర్శించారు. మఠం సమీపంలోని భూముల వివరాలు, కొలతల వివరాలను పంపించాలని సర్వేయర్ సద్దాంను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఎమ్మెల్సీ భరత్ కలిసి ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం కలెక్టర్ సొన్నేగానిపల్లి పంచాయతీలోని గుండిశెట్టిపల్లి వద్ద హంద్రీ–నీవా కాలువతో పాటు ఎంకే పురం చెరువుకు నీటిని విడుదల చేసే వాల్వును పరిశీలించారు. కార్యక్రమంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్‌ఐ మధుసూదన్, మండల బూత్ మేనేజర్ విజయకుమార్ పాల్గొన్నారు.

### సరిహద్దుల్లో కట్టదిట్టంగా నిఘా



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ జాషువా

**నగరి :** రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దుల వద్ద కట్టుదిట్టంగా నిఘా చేయాలని ఎస్పీ జాషువా ఆదేశించారు. మంగళవారం తడుకుపేట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగదు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్పష్టం చేశారు. నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సూచించారు. అసాంఘిక శక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఆ మేరకు చెక్‌పోస్టుల్లో మూడు షిఫ్టులుగా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ గంగిరెడ్డి, సీఐ సురేష్ పాల్గొన్నారు.

### పలువురు డీఎస్పీలకు స్థానచలనం

**చిత్తూరు అర్బన్:** సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆళ్లగడ్డలో ఉన్న ఎస్.సుధాకర్ రెడ్డిని ఏసీబీకు అటాచ్ చేస్తూ చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌కు, తిరుమల ట్రాఫిక్‌లో పనిచేస్తున్న డీపీ కొండయ్యను కర్నూలు ఎస్సీ ఎస్టీ విభాగానికి, పోలవరం నుంచి పైడేశ్వర రావును శ్రీసిటీకి, ఇక్కడ నుంచి జగదీష్ నాయక్‌ను బాపట్ల క్రైమ్‌కు, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న యు.నరసింగప్పను తిరుపతి ఎస్సీ, ఎస్టీ విభాగానికి, తిరుపతి క్రైమ్ నుంచి ఎం.జనార్ధన్‌ను ఎన్టీఆర్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

### 'సురక్ష'కు విశేష స్పందన

**చిత్తూరు రూరల్:** జిల్లా వ్యాప్తంగా 14 ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులకు విశేష స్పందన లభించింది. ఆయా శిబిరాల్లో 114 మంది పీహెచ్‌సీ డాక్టర్లు, 28 మంది ప్రత్యేక వైద్యులు పాల్గొని, మొత్తం 4,498 మందికి చికిత్సలందించారు. అందులో జనరల్ ఓపీకి 2,234 మంది, గైనిక్‌కు 324, చిన్నపిల్లల సేవలకు 206, ఆర్థోకు 695, డెంటల్ 135, చర్మం 125, కంటి సమస్యలు 472, ఇతర సేవలకు 296 మంది వైద్యసేవలు పొందారు. కంటి వెలుగు కింద 167 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

### పది పరీక్షల నిర్వహణపై 17న సమీక్ష

**చిత్తూరు కలెక్టరేట్ :** పదోతరగతి పరీక్షల నిర్వహణపై ఆర్‌జేడీ వై.రాఘవరెడ్డి ఈ నెల 17వ తేదీన చిత్తూరులో సమీక్షించనున్నారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. సమీక్షకు డీవైఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు హాజరుకావాలని ఆదేశించారు.

## ఇది కదా.. అభివృద్ధి

# నవీన వెలుగుల నగరి

ఆరు దశాబ్దాల క్రితం ఏర్పడినా.. నగరి నియోజకవర్గం గతంలో అభివృద్ధి ఆమడ దూరంలోనే నిలిచి ఉండేది.. నాటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎప్పుడూ వెనుకంజలోనే ఉండి పోయేది.. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సరిహద్దు సెగ్మెంట్ స్థాయి పెరిగింది.. మంత్రి రోజా నేతృత్వంలో ప్రగతి పథంలో పయనిస్తోంది.. శిథిలావస్థలోని సర్కారు బడులు నూతన శోభను సంతరించుకున్నాయి.. దయనీయంగా దర్శనమిచ్చిన ప్రభుత్వాస్పత్రులు అత్యాధునిక వసతులతో అలరారుతున్నాయి.. అతుకుల గతుకుల రహదారులు సువిశాలంగా మార్గాలుగా రూపాంతరం చెందాయి.. నిర్వీర్యంగా మారిన నేతన్నల బతుకుల్లో సంక్షేమ వెలుగులు నిండాయి.. పల్లెసీమల్లో సైతం ప్రభుత్వ భవనాలు వెలిశాయి.. వ్యవసాయాన్ని పండుగలా మారుస్తూ రైతన్నలకు బాసటగా నిలుస్తున్నాయి. నిరుపేదల జీవన ప్రమాణాలు ఆశాజనకంగా మెరుగుపడ్డాయి.

- సరిహద్దు నియోజకవర్గంలో ప్రగతి పరుగులు
- రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు
- నిరుపేదలకు బాసటగా సంక్షేమ ఫలాలు
- మంత్రి రోజా ఆధ్వర్యంలో మారిన నగరి రూపురేఖలు



మిట్టపాళెం వద్ద ఒకే ప్రాంగణంలో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్



నగరిలోని వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



నూతనంగా నిర్మించిన పీఏసీఎస్

**నగరి :** జిల్లా సరిహద్దులోని నగరి నియోజకవర్గంపై గత టీడీపీ ప్రభుత్వం శీతకన్ను వేసింది. అభివృద్ధి సంగతి దేముడెరుగు.. కనీసం మౌలిక వసతుల కల్పనను సైతం నిర్లక్ష్యం చేసింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పడకేసిన అభివృద్ధికి చలనం వచ్చింది. మంత్రి ఆర్‌కే రోజా ప్రత్యేక చొరవతో ప్రగతి పరుగులు తీస్తోంది. నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో సుమారు రూ.521.6 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఇక సంక్షమ పథకాల కింద ప్రజలకు నేరుగా రూ.1,051.8 కోట్లు అందించారు. గత టీడీపీ ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైతే.. నేటి వైఎస్సార్‌సీపీ సర్కారు చేతల్లో అభివృద్ధిని చేసి చూపించింది. ప్రజామోదంతోపాటు ఆదరణను సైతం చూరగొంటోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నగరి నియోజకవర్గం ముందంజలో పయనిస్తోంది. నగరిని ప్రత్యేంగా రెవెన్యూ డివిజన్ చేశారు. ఆర్‌డీఓ కార్యాలయంతో పాటు నగరి, పుత్తూరులో డీఎస్పీ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద మొత్తం 5,708 మంది నిరుపేదలకు జగనన్న ఇళ్లు మంజూరు చేశారు. అందులో ఇప్పటికే 3,210 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

### అభివృద్ధి పనులు ఇవీ..



నిర్మాణంలోని బుగ్గ మంగళం కాలువ



నూతనంగా నిర్మించిన పాదిరి అయనంబాకం రోడ్డు



అభివృద్ధి చేసిన నగరి ఏరియా ఆస్పత్రి

- నాడు – నేడు కింద రూ.54 కోట్లతో 226 పాఠశాలు, 3 కళాశాలల అభివృద్ధి
- రూ. 7 కోట్లతో పుత్తూరు పిళ్లారి పట్టులో పాలిటెక్నిక్ నిర్మాణం
- రూ. 5.7 కోట్లతో మాధవరంలో ఐటీఐ కళాశాల
- రూ.5 కోట్లతో నగరి ఏరియా వైద్యశాల ఆధునికీకరణ
- రూ.3.2 కోట్లతో 4 అర్బన్ హెల్త్ సెంటర్లు
- రూ.3.2 కోట్లతో నియోజకవర్గంలోని పీహెచ్‌సీల అభివృద్ధి
- రూ.7 కోట్లతో మొక్కల చేను కండ్రిగ వద్ద నీటి ప్రాజెక్టు
- రూ. 6.2 కోట్లతో బుగ్గకాలువ నుంచి మంగళం వరకు నీటి కాలువ నిర్మాణం
- రూ. 15 కోట్లతో నగరి పురపాలక ప్రజలకు దాహార్తిని తీర్చడం
- పుత్తూరులో శాశ్వత మంచినటి పథకానికి రూ.149 కోట్లు
- పుత్తూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి రూ. 9 కోట్లు
- రూ.10.24 కోట్లతో రైతుభరోసా కేంద్ర భవనాల నిర్మాణం
- రూ.68లక్షలతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- రూ.17.21 కోట్లతో సచివాలయ భవనాల నిర్మాణం
- రూ.3.60 కోట్లతో నగరిలోని దేశమ్మ ఆలయ పునర్నిర్మాణం
- రూ.25లక్షలతో పుత్తూరులోని ద్రౌపదరమ్మ ఆలయ రాజగోపుర నిర్మాణం
- రూ.25 లక్షలతో శివాలయం కోనేరు నిర్మాణం
- నింద్రలో రూ.1.7 కోట్లతో వెంకటేశ్వర ఆలయ ఆధునికీకరణ
- రూ. 40 లక్షలతో పలుగ్రామాల్లో ఆలయాల నిర్మాణం
- వడమాలపేట మండలం అప్పలాయిగుంటలో 3.4 కోట్లతో కల్యాణమండపం
- రూ. 2.41 కోట్లతో పుత్తూరులో షాదీ మహల్
- రూ. 2కోట్లతో నగరి బుగ్గ ఆలయం వద్ద కల్యాణ మండపం నిర్మాణం
- 3వేల మంది మహిళలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా నింద్ర మండలం ఎంఎస్‌వీఎంపురంలో టెక్స్‌టైల్ ఎక్స్‌పోర్టు కంపెనీకి అనుమతులు
- రూ. 1.10 కోట్లతో పుత్తూరులో మున్సిపల్ పార్కు,
- రూ.24 లక్షలతో చిల్డ్రన్ పార్కుకు ప్రహరీగోడ
- రూ.39.5 లక్షలతో వడమాలపేటలో తుడా పార్కు
- రూ.80 లక్షలతో నగరిలో తుడాపార్కు
- రూ.4కోట్లతో నగరి, పుత్తూరులో మున్సిపల్ కార్యాలయాల నిర్మాణం
- పుత్తూరులో రూ.1.10 కోట్లతో ఆధునిక శ్మశాన వాటిక
- రూ.8 లక్షలతో పుత్తూరు 3వ వార్డులో ఉత్తరక్రియల షెడ్డు
- రూ.1.75 కోట్తో నగరి శ్మశాన వాటిక ఆధునికీకరణ
- రూ.20 లక్షలతో నగరి 6వ వార్డు శ్మశాన వాటిక అభివృద్ధి
- రూ.1.5 కోట్లతో కీళపట్టు నుంచి తమిళనాడు సరిహద్దు వరకు రోడ్డు
- రూ. 62 లక్షలతో ఐనంబాకం వయా పాదిరి రోడ్డు నిర్మాణం.
- రూ.1.08 కోట్లతో నాగలాపురం– ఇరుగువాయి రోడ్డు
- రూ.86.50 లక్షలతో ఇల్లత్తూరు రోడ్డు నిర్మాణం
- నగరి, పుత్తూరు మున్సిపాలిటీలో రూ.35 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- రూ.8.4 కోట్లతో కుశస్థలి నదిపై వంతెన నిర్మాణానికి టెండర్లు
- రూ.1.68కోట్లతో నగరి సహకార సంఘం అభివృద్ధి
- రూ. 78 లక్షలతో పుత్తూరులో స్కేటింగ్ రింగ్ నిర్మాణం
- రూ.33.80 లక్షల చొప్పున నింద్ర, విజయపురంలో జిమ్‌లు
- రూ.90లక్షలతో 3 జగనన్న సమావేశ మందిరాలు
- రూ.25లక్షలతో పలు చోట్ల బస్ షెల్టర్లు
- రూ.15లక్షలతో రెండు వైఎస్సార్ రిసెప్షన్ హాళ్లు
- రూ.9లక్షలతో 3 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు
- 5,708 మంది నిరుపేదలకు జగనన్న ఇళ్ల నిర్మాణం

### నగరి నియోజకవర్గ సమాచారం

| | |
|---|---|
| మున్సిపాలిటీలు | 02 |
| మండలాలు | 05 |
| జనాభా | 266703 |
| ఓటర్లు | 201447 |



**ఎన్నడూ లేనంత**

గతంలో ఎన్నడూ లేనంతగా నగరి అభివృద్ధి చెందింది. ముఖ్యంగా పాఠశాలలు, ఆస్పత్రులు, రోడ్లు చక్కగా తయారయ్యాయి. ఇందులో మంత్రి రోజా కృషి ఎనలేనిది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం కారణంగానే వెనుకబడిన మా ప్రాంతం ముందంజలోకి వచ్చింది. – స్టూడియో బాబు, నగరి



**గొప్పగా అభివృద్ధి**

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పాలిటెక్నిక్‌ను ప్రారంభించారు. పాఠశాలలు ఆధునీకరించారు. ఆస్పత్రులను మెరుగుపరచారు. మూడు జగనన్న లేఅవుట్లలో వందల ఇళ్లు నిర్మిస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. గొప్పగా అభివృద్ధి చేస్తున్నారు. – బాలకృష్ణమరాజు, ఒంటిమిట్ట, పుత్తూరు మండలం



**సుభిక్షంగా ఉంది**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి రోజా పాలనలో నియోజకవర్గం సుభిక్షంగా ఉంది. క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరిగింది. ప్రజలకు సక్రమంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. ఆలయాలను సైతం అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. రోడ్లను నూతనంగా నిర్మించారు. – సుబ్రమణ్యం, నింద్ర



**పాలన భేష్**

స్కూళ్లు, ఆస్పత్రులు, రోడ్లు ఎక్కడ చూసినా ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపిస్తోంది. జగనన్న పాలన భేష్, తాగునీటికి అలమటిస్తున్న వారి దాహార్తిని తీర్చారు. ఇల్లు లేని మాలాంటి వారికి సొంత గూడు కట్టుకునే అవకాశం కల్పించారు. – నటరాజ్, మాధవరం, విజయపురం మండలం



**జగనన్న సహకారంతోనే ..**

నగరి నియోజకవర్గ ప్రజలు రెండుసార్లు నన్ను ఆశీర్వదించారు. 2014లో ప్రభుత్వం అధికారంలో లేకపోవడంతో ప్రతి పనికీ టీడీపీ నేతలు అడ్డుపడ్డారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నేను చేయాలనుకున్న అభివృద్ధి పనులు చేయగలిగా. ముఖ్యమంత్రి జగనన్న సహకారంతోనే ఇది సాధ్యమైంది. – ఆర్‌కే రోజా, మంత్రి



కీళపట్టు శివారులో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ



నింద్రలో నిర్మిస్తున్న టెక్స్‌టైల్ ఎక్స్‌పోర్టు కంపెనీ



నగరిలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత దేశమ్మ ఆలయం



వడమాలపేటలో నిర్మించిన కల్యాణమండపం



ఆధునికీకరించిన సత్రవాడ ప్రాథమిక పాఠశాల



పుత్తూరులోని పార్కు

## ఆడపడుచుల సాధికారతకు 'ఆసరా'



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ

**గంగవరం :** నిరుపేద అక్కచెల్లెమ్మల సాధికారతకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నట్లు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీలో వారు పాల్గొన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక్క గంగవరం మండలంలోనే నాలుగు విడతల్లో ఆసరా పథకం కింద పొదుపు మహిళల ఖాతాల్లో మొత్తం రూ.41.41 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆడపడుచులను అప్పులపాలు చేశారని ఆరోపించారు. 2014లో ప్రజలను మోసం చేసి చంద్రబాబు అధికారంలోకి వచ్చాడన్నారు. అందుకే 2019లో జనం తగిన బుద్ధి చెప్పారన్నారు. మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు అబద్ధపు హామీలతో చంద్రబాబు అండ్ కో వస్తున్నారని హెచ్చరించారు. ఆడపడుచుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగిస్తున్నారని, అందుకే ప్రతి పథకాన్ని మహిళల పేరిటే అందిస్తున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు జరిగి ఉంటేనే ఓటేయమని స్పష్టంగా చెప్పిన ఏకైక నాయకుడు జగనన్న అని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. అనంతరం పొదుపు మహిళలకు రూ.10.35 కోట్ల మెగా చెక్కు అందించారు. కార్యక్రమంలో పలమనేరు సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్‌వీ సుభాష్‌చంద్రబోస్, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు పార్వతి, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచ్ చంద్రమ్మ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, రాధాకృష్ణ, సచివాలయాల కన్వీనర్ల మండల అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, ఏసీ హరినాథ్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మానవత్వం పరిమళించె!



బాధితులకు సాయం అందించి మాట్లాడుతున్న విజయానందరెడ్డి

**చిత్తూరు కార్పొరేషన్:** మధ్యప్రదేశ్‌కు చెందిన రాకేష్(23) అనే యువకుడు చిత్తూరులో సెంట్రింగ్ కూలీగా పనిచేసేవాడు. సోమవారం రాత్రి ఇరువారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అయితే మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లేందుకు నగదు లేక కుటుంబీకులు నానా అవస్థలు పడ్డారు. చివరకు జైన్ సంఘం ఆధ్వర్యంలో ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించారు. రాకేష్ మృతదేహాన్ని విమానంలో తీసుకెళ్లేందుకు ఆర్థిక సాయం అందించారు. మృతుడికి వారి స్వస్థలంలో అంత్యక్రియలు చేసుకునే అవకాశం కల్పించారు. ఇక్కడి ఓటరు కాకపోయినా మానవత్వంతో ఆదుకున్న విజయానందరెడ్డిని నగర ప్రజలు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో జైన్ సంఘం నాయకుడు సుభాష్‌జైన్ పాల్గొన్నారు.

## 20న మెగా జాబ్‌మేళా

**చిత్తూరు కలెక్టరేట్ :** రీజనల్ మెగా జాబ్‌మేళా నిర్వహణ తేదీని 15 నుంచి 20వ తేదీకి మార్చినట్లు కలెక్టర్ షణ్మోహన్ వెల్లడించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల మేళా తేదీని మార్చామన్నారు. ఈ క్రమంలో చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని యువత గమనించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8465830771, 6300954441, 8142509017, 8374421195 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## క్లుప్తంగా

### జేఈఈ మెయిన్స్‌లో దీక్షిత ప్రతిభ



పెనుమూరు(కార్వేటినగరం) : పెనుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఎంపీసీ విద్యార్థిని దీక్షిత ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో 75.79 శాతం మార్కులు సాధించి సత్తా చాటింది. మంగళవారం ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యం రాజు మాట్లాడుతూ దీక్షిత ఇంటర్ ఫస్టియర్‌లో 470 గాను 459 మార్కులు సాధించి ప్రభుత్వం జూనియర్ కళాశాలల విభాగంలో జిల్లా ఫస్ట్ సాధించిందన్నారు. అదే స్ఫూర్తితో జేఈఈలోనూ జిల్లా మొదటి స్థానం దక్కించుకున్నట్లు వెల్లడించారు.

### లారీ ఢీకొని ఒకరి మృతి

**చిత్తూరు అర్బన్:** నగరంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాకేష్ (23) అనే యువకుడు మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కథనం మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రం అనుప్పూరు జిల్లాకు చెందిన రాకేష్ గతకొంత కాలంగా చిత్తూరులోని ఇరువారానికి చెందిన సతీష్ తాపీ మేస్త్రీ వద్ద కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బైక్‌పై నీళ్ల క్యాన్ తీసుకురావడానికి రోడ్డు దాటుతుండగా.. వేలూరు నుంచి నెల్లూరు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ రాకేష్‌ను స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జరిమానా

**చిత్తూరు అర్బన్:** మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి రూ.20 వేల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. ఇటీవల నగరంలో ట్రాఫిక్ సీఐ నిత్యబాబు చేపట్టిన తనిఖీల్లో ఇద్దరు యువకులు మద్యం సేవించి వేర్వేరు వాహనాల్లో వస్తూ పట్టుబడ్డారు. వీళ్లపై మోటారు వెహికల్ యాక్టు సెక్షన్ 185 కింద కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితులు నేరం అంగీకరించడంతో ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు






# 'ఇన్‌స్పైర్' చేద్దాం..!

- విద్యార్థి దశ నుంచే భావి శాస్త్రవేత్తల ఆవిర్భావం
- ఏటా ఇన్‌స్పైర్ మనక్ ఆవిష్కరణలు
- 6 నుంచి 10 తరగతి పిల్లల ప్రతిభకు ప్రోత్సాహం
- నేడు జిల్లా స్థాయి కార్యక్రమం ప్రారంభం
- ప్రదర్శనలో 417 సైన్స్ ప్రాజెక్టులు

**చిత్తూరు కలెక్టరేట్ :** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనను నిర్వహిస్తున్నాయి. విద్యార్థి దశ నుంచే భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో 6 నుంచి 10 వ తరగతి విద్యార్థులు ఈ ఆవిష్కరణలో పాల్గొననున్నారు. వారు తయారు చేసిన వివిధ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్టులకు అయ్యే ఖర్చును ప్రభుత్వాలే భరిస్తున్నాయి. ఎంపిక చేసిన విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నగదును జమ చేస్తున్నాయి.

**అంతర్జాతీయ స్థాయికి జిల్లా విద్యార్థులు**

గతంలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో జిల్లాలోని సర్కారు బడుల విద్యార్థులు నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఆ ప్రాజెక్టులతో జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు వెళ్లారు. జపాన్‌లోని సకురాలో నిర్వహించిన అంతర్జాతీయ ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో మన విద్యార్థులు తయారు చేసిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఈ నెల 14,15,16 తేదీల్లో చిత్తూరు సమీపంలోని పీఈఎస్ పబ్లిక్ స్కూల్‌లో ఇన్‌స్పైర్ మనక్ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు జిల్లాలోని పలు మండలాల విద్యార్థులు ఇన్‌స్పైర్ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మొత్తం 417 ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. జిల్లా స్థాయి ప్రదర్శనల్లో సత్తా చాటిన విద్యార్థుల ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నారు. న్యాయనిర్ణేతలుగా సీనియర్ టీచర్, అధ్యాపకులను నియమించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే విద్యార్థులకు వసతి సౌకర్యాలను కల్పిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. జిల్లా స్థాయి కార్యక్రమం పరిశీలనకు న్యూఢిల్లీ లోని నేషనల్ ఇన్నోవేటివ్ ఫౌండేషన్ నుంచి ఇద్దరు అబ్జర్వర్లు విచ్చేశారు.

**పకడ్బందీగా నిర్వహణ**



చిన్నతనం నుంచే విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు ఇన్‌స్పైర్ మనక్ ఉపయోగపడుతుంది. ఈ మేరకు ప్రోత్సాహం కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం విద్యార్థులకు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలి. ఇలాంటి ప్రదర్శనల్లో పాల్గొనడం వల్ల శాస్త్రీయ దృక్పథం పెరుగుతుంది. సృజనాత్మకతను ప్రదర్శించేందుకు ఇవి చక్కని వేదికలు. పకడ్బందీగా మూడు రోజుల పాటు ఇన్‌స్పైర్ మనక్ నిర్వహించాలని ఆదేశించాం.

– షణ్మోహన్, కలెక్టర్

**సృజనాత్మకత పెరుగుతుంది**



ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాం. పాల్గొనే విద్యార్థులకు, గైడ్ టీచర్లకు వసతి సౌకర్యం కల్పిస్తున్నాం. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటే పిల్లల సృజనాత్మకత పెరుగుతుంది. ప్రశ్నించడం ద్వారానే కొత్త విషయాలు తెలుస్తాయి. తెలుసుకోవాలనే జిజ్ఞాసతో శాస్త్ర విజ్ఞానం పట్ల మక్కువ పెరుగుతుంది. పాఠశాల స్థాయి నుంచే ఇలాంటివి విద్యార్థులు అలవరచుకోవాలి.

– దేవరాజు, డీఈఓ.

### బాలిక అదృశ్యంపై కేసు

**తిరుపతి రూరల్:** తిరుపతి రూరల్ మండలం, మల్లంగుంటకు చెందిన ఇంటర్ విద్యార్థిని కనిపించడం లేదని బాలిక తండ్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం నుంచి కనపడకపోవడంతో తల్లిదండ్రులు బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టినా జాడ కనిపించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్‌షావలి తెలిపారు.

### గంజాయి, శ్రీగంధం విక్రేతల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ చిన్నగోవింద్, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి

**గంగవరం :** గంజాయి, శ్రీగంధం విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ చిన్నగోవింద్ కథనం మేరకు.. ఓల్డ్ మునినారాయణ వీధికి చెందిన జిలానీ తన ఇంటి వద్ద గంజాయి మొక్కలను పెంచుతూ అక్రమంగా విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేయగా గంజాయితో పాటు శ్రీగంధం చెక్కలు సైతం పట్టుబడ్డాయి. జిలానీతో పాటు ఈ వ్యాపారంలో భాగస్వాములైన కేజీ సత్రానికి చెందిన కుమార్, పెద్దపంజాణి మండలం గౌరీనగర్‌కు చెందిన శేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి. రూ. 20వేలు విలువైన గంజాయి, శ్రీగంధం చెక్కలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### మార్చి 5, 6 తేదీల్లో జిల్లాకు పది ప్రశ్నపత్రాలు

**చిత్తూరు కలెక్టరేట్ :** పది పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు మార్చి 5,6 తేదీల్లో జిల్లాకు రానున్నాయి. మంగళవారం ఈ మేరకు రాష్ట్ర పరీక్షల విభాగం అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. విజయవాడ నుంచి ప్రత్యేక భద్రతా వాహనాల్లో 5న సెట్–1, 6వ తేదీన సెట్–2 ప్రశ్నపత్రాలు చేరుకోనున్నాయి.

**పరీక్షలకు ఫ్లయింగ్ స్క్వాడ్**

పదోతరగతి పబ్లిక్ పరీక్షల పర్యవేక్షణకు ఫ్లెయింగ్ స్క్వాడ్‌లను నియమించాలని రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఆ మేరకు పరీక్షలకు 6, సప్లిమెంటరీ కి 3 బృందాలను నియమించాలని పేర్కొన్నారు.

### ప్రమాదంలో వ్యక్తి మృతి

**తిరుపతి రూరల్:** గుర్తు తెలియన వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వకుళామాత గుడి వద్ద చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ షేక్షావలి కథనం.. చెన్నై రామలింగనగర్‌కు చెందిన అరుణ్‌కాంత్ (38) ద్విచక్ర వాహనంపై మంగళవారం తెల్లవారుజామున తిరుపతికి వస్తున్నాడు. వకుళామాత గుడి సమీపంలో పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో తిరుపతి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా కు తరలించారు.

# వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు



టీడీపీ శ్రేణులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

**పాలసముద్రం :** మండలంలోని ఆముదాల, సింహరాజుపురం పంచాయతీలకు చెందిన టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో మంగళవారం చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో సింహరాజుపురం మాజీ సర్పంచ్ విజయన్ వారితో 20 కుటుంబాలు, ఆముదాలలో రాజేష్, చిదంబరం, సి.శివ, రాముడు, సురేష్, సి.గోవిందన్, సి.ఆర్ముగం, గణేష్, త్యాగరాజు, టి.బాబు, ఎన్.మునస్వామి, చిరంజీవి, సి.కన్నాయరం, ఎన్.శివ, అబ్రగాన్, పిచ్చిముత్తు, ఆముదాల ఎంపీటీసీ సభ్యుడు లిఖిత అరుల్, సర్పంచ్ అనురేఖమదివాన్ ఆధ్వర్యంలో 25 కుటుంబాల వారు ఉన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వెల్లడించారు.

# నాణ్యమైన బోధనే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జీవనజ్యోతి

**చిత్తూరు కలెక్టరేట్ :** విద్యార్థులకు నాణ్యమైన బోధనే అధ్యాపకుల లక్ష్యంగా ఉండాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి తెలిపారు. మంగళవారం చిత్తూరులోని కళాశాలలో డిగ్రీ అధ్యాపకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాక్ (జాతీయ మదింపు గుర్తింపు సంస్థ) నిర్వహణ అంశాలపై అధ్యాపకులకు అవగాహన అవసరమన్నారు. డిగ్రీ కళాశాలల పనితీరును నాక్ సంస్థ మదింపు చేసి తగిన గుర్తింపును ఇస్తుందని చెప్పారు. దీంతో కళాశాలలో వసతులు పెరుగుతాయని వివరించారు. అన్నమయ్య జిల్లా పీలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నాక్ నిబంధనలను తెలుసుకుని కచ్చితంగా అమలు చేయాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త పరమేశ్వర, పీవీకేఎన్ వైస్ ప్రిన్సిపల్ మీరాసాహెబ్, పీవీకేఎన్ ఐక్యూఏసీ సమన్వయకర్త హరిప్రసాద్ పాల్గొన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు





శ్రీవారి ఆలయ వెలుపల డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎస్పీ మల్లికా గార్గే,

**తిరుమల:** తిరుమల శ్రీవారిని మంగళవారం ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తిరుపతి నూతన ఎస్పీ మల్లికాగార్గే, ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సీవీ.నాగార్జున రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

# వైభవంగా వినాయకుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న, అర్చకులు

**కాణిపాకం (యాదమరి):** పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం, కవిటం గ్రామంలో కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. తొలుత దేవదాయ ధర్మాదాయ శాఖ, ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కాణిపాకం నుంచి ధర్మప్రచార రథంలో వెళ్లిన సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుతీర్చారు. అనంతరం కాణిపాకం ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణ తంతు నిర్వహించారు. ఇన్‌చార్జి విగ్నేష్, ఆలయ స్థానాచార్యులు ఫణికుమార్ శర్మ పాల్గొన్నారు.

# నాడు అధ్వానం.. నేడు అద్భుతం



టీడీపీ హయాంలో షాదీమహల్ దుస్థితి (ఫైల్)



ప్రస్తుతం పుత్తూరులో నూతనంగా నిర్మించిన షాదీమహల్

- రూ.1.85 కోట్లతో నూతన భవన నిర్మాణం
- రూ.56 లక్షలతో మరింత అభివృద్ధి
- మంత్రి రోజా చేతుల మీదుగా రేపే ప్రారంభోత్సవం

**పుత్తూరు :** పట్టణంలో అధునాతన వసతులతో తీర్చిదిద్దిన షాదీమహల్‌ను మంత్రి ఆర్‌కే రోజా గురువారం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో నగరి నియోజకవర్గంలోని ప్రతి ముస్లిం ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రాజ్యాంగ, కార్పొరేషన్ పదవులను కేటాయిస్తోంది. గత టీడీపీ హయాంలో పుత్తూరులో షాదీమహల్ పునర్నిర్మాణం కోసం స్థానిక ముస్లిం నేతలు విశ్వప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మైనారిటీల చిరకాల స్వప్నం నెరవేరింది. మంత్రి రోజా స్థానికి ముస్లింల జీవన స్థితిగతులను, వారి అవసరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. షాదీమహల్ నిర్మిస్తే ముస్లిం కుటుంబాల్లో జరిగే వివాహాలకు ఎంతో ఉపయుక్తంగా, ఆర్థికంగా ఆదుకున్నట్లు అవుతుందని వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి వెంటనే పుత్తూరు షాదీమహల్ నిర్మాణం కోసం రూ.1.85 కోట్లు మంజూరు చేశారు. షాదీ మహల్ నిర్మాణం కోసం ఇంత పెద్ద మొత్తం మంజూరు చేయడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం. ఈ నిధులతో స్థానిక తిరుపతి రోడ్డులోని ఈద్గా మసీదు వద్ద పాడుబడిన షాదీమహల్ గోడలను తొలగించి నిర్మాణ పనులను ప్రారంభించారు. నేటి అవసరాలకు తగ్గట్టు అధునాతన వసతులతో షాదీహహల్ నిర్మాణం పూర్తి చేశారు.

**తుడా నిధులతో మరింత మెరుగులు**

మంత్రి ఆర్‌కే రోజా సూచనల మేరకు షాదీమహల్ ప్రాంగణంలో తుడా నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహీన్ తెలిపారు. రూ.56 లక్షలతో షాదీమహల్ ముఖద్వారం వద్ద ఆర్చి, అదనంగా మరో కిచెన్, రెండు సంపులు, ఆరు వాష్‌రూమ్స్ నిర్మిస్తున్నట్లు వివరించారు. అలాగే 1.15 ఎకరాల్లో షాదీమహల్ నిర్మాణంతో పాటు, ఇదే ఆవరణలో మసీదు, ఈద్గా బరియల్ గ్రౌండ్‌కు చెందిన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.